క్లుప్తంగా

ధైర్యంగా ముందడుగు వేయండి: సీఐ రేణుకారెడ్డి



మాట్లాడుతున్న సీఐ

అల్లాదుర్గం(మెదక్): సమాజంలో ఆడపిల్లలు ధైర్యంగా ముందడుగు వేయాలని సీఐ రేణుకా రెడ్డి అన్నారు. సోమవారం అల్లాదుర్గం కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ముస్లాపూర్ జెడ్పీ పాఠశాల విద్యార్థులు కలిసి ట్వీన్నింగ్ నిర్వహించారు. కేజీబీవీ విద్యార్థులతో ముస్లాపూర్ పీఎంశ్రీ పాఠశాల విద్యార్థులు కలిసి ఆటలు ఆడి, పాటలు పాడి, చదువుతూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. కుటుంబ వ్యవస్థలో, సమాజంలో బాలురు, బాలికలు సమానమేనన్నారు. ధైర్యంతో ముందడుగు వేస్తే ఏదైన సాధించవచ్చని సూచించారు. పరీక్షలు దగ్గర పడుతుండటంతో ఏకాగ్రతతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ పద్మలత, డాక్టర్ సంధ్యారాణి, ప్రిన్స్‌పాల్ స్రవంతి, హెచ్‌ఎంలు ధనుంజయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నిర్లక్ష్యం వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామాల్లో ఉపాధిహామీ పనులపై ఈజీఎస్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా అన్నారు. సోమవారం ఈజీఎస్ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రతీ గ్రామంలో 60 మంది కూలీలకు తగ్గకుండా పనులు కల్పించాలని, మెటీరియల్ పేమెంట్స్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ విఠల్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ నవాజుద్దీన్ తదితరులు ఉన్నారు.

విరాళం అందజేత



కుసంగిలో విరాళాన్ని అందిస్తున్న యూసుఫ్

టేక్మాల్(మెదక్): మండలంలోని కుసంగి గ్రామంలో చిరుతల రామాయణ నాటక ప్రదర్శనకు సోమవారం జిల్లా మాజీ కో–ఆప్షన్ సభ్యులు యూసుఫ్ రూ.50వేలు విరాళంగా అదించారు. నాటక ప్రదర్శనకు సహకరించిన యూసూఫ్‌కు చిరుతల రామాయణ నాటక ప్రదర్శన సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో మాజీ సర్పంచ్ మొగుల్ రెడ్డి, చిరుతల రామాయణ సభ్యులు పాల్గొన్నారు.

విహారయాత్రకు విద్యార్థులు



వరంగల్‌లో విద్యార్థులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం విజ్ఞాన విహారయాత్రకు వెళ్లారు. పాఠశాలకు చెందిన 350 విద్యార్థులు 5 బస్సుల్లో మేడారంలోని సమ్మక్క సారలక్క, వరంగల్‌లోని వేయి స్తంభాల గుడి, రామప్ప ఆలయాల సందర్శించారని హెచ్‌ఎం బాలచంద్రం తెలిపారు. విద్యార్థులకు విజ్ఞానం పెంపొందించేందుకు ప్రాచీన సందర్శనీయ ప్రదేశాలు చూడడం ద్వారా ఎంతగానో ఉపయోగపడుతున్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు



ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రాంపూర్‌లో సర్వేనంబర్ 375లోని 12 ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలో కొంతమంది కబ్జా చేశారు. ఈ విషయమే గ్రామస్తులు పలుమార్లు జిల్లా అధికారులకు, మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు స్పందించిన రెవెన్యూ అధికారులు సోమవారం కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఇకపై ఎవరైనా అట్టి ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు యత్నించిన వారు శిక్షార్హులవుతారని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ తెలిపారు. అందుకు ముందు కబ్జాకు గురైన తేనెకుంటలోని 4 ఎకరాల 20 గుంటలు, కప్పల కుంటలోని 4 ఎకరాలతో పాటు మరో 4 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ముందస్తు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

పాపన్నపేట(మెదక్): మెదక్‌ను రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని చిత్రియాల్‌లో గంగమ్మగుడి ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన 15 నెలల కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశానని తెలిపారు. ఏడు పాయల చరిత్రలో తొలిసారిగా ముఖ్యమంత్రిని ఆహ్వానించి రూ.35 కోట్లతో రోడ్డు మంజూరు చేయించామని అన్నారు. మెదక్ చర్చికి కూడా రూ.29.10 కోట్లు మంజూరు చేయించామని చెప్పారు. మెదక్‌కు మెడికల్, పారా మెడికల్ కళాశాలలు మంజూరు చేయించిన ఘనత తమదేనన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గోవింద్ నాయక్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, ప్రశాంత్ రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు గౌస్, ఎంపీటీసీ శ్రీనివాస్, రఘు, మోహన్ పాల్గొన్నారు.



పాపన్నపేట(మెదక్): చిత్రియాల్‌లో గంగమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్

పదేళ్లలో జరగని అభివృద్ధిని చేసి చూపిస్తా

చిన్నశంకరంపేట(మెదక్): పదేళ్లలో జరగని అభివృద్ధిని ఏడాది కాలంలోనే చేసి చూపిస్తానని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. సోమవారం నార్సింగి మండలం శేరిపల్లిలో మల్లికార్జున ఆలయం, సంకాపూర్‌లోని గురుద్వార ఉత్సవాలకు హాజరయ్యారు. అనంతరం చిన్నశంకరంపేటలోని చెన్నాయిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న మల్లన్న జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆయన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, గోపాల్‌రెడ్డి, అరుణ, మోహన్, యాదవ సంఘం సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా రాయకుంటే చర్యలు

చేగుంట(తూప్రాన్): క్షేత్రస్థాయిలో ఉపాధిహామీ పనులకు సంబంధించిన రికార్డులను సక్రమంగా రాయకుంటే కఠిన చర్యలు ఉంటాయని డీఆర్డీఓ పీడీ శ్రీనివాస్‌రావ్ హెచ్చరించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో 2023–24 ఉపాధి పనులకు సంబంధించి 15వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు.మండలంలోని గ్రామాల్లో ఉపాధి పనుల్లో రూ.6కోట్ల 4లక్షల 93వేల 6వందలతో ఈజీఎస్ పనులు, రూ.కోటి 80 లక్షల 39 వేల 2వందల నలభైతొమ్మిది పంచాయతీ రాజ్ పనులు, 38లక్షల 7వేల7 వందల మూడు రూపాయలతో ఫారెస్ట్ పనులు నిర్వహించగా వాటికి సంబంధించిన సామాజిక తనిఖీ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయి రికార్డులు సక్రమంగా రాయకపోవడంతో వారు రూ.44వేల అపరాధ రుసుం చెల్లించాలని, పనుల్లో జరిగిన అవకతవకలకు రూ.88వేల 5వందల ఎనభైతొమ్మిది రికవరీ కోసం అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ శ్రీహరి, హెచ్‌ఆర్ రాజేందర్‌రెడ్డి, ఎస్‌ఆర్‌పీ రమేశ్, ఎంపీడీఓ చిన్నారెడ్డి, పీఆర్‌ఏఈ అభినవ్, ఏపీఓ స్వేత టీఏలు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

చనిపోయిన కోళ్లకు బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని నాయిని జలాల్పూర్ గ్రామంలోని సతీష్‌గౌడ్‌కు చెందిన పౌల్ట్రీఫామ్‌లో ఆదివారం వేయికి పైగా కోళ్లు చనిపోయాయి. ఈ విషయమై సోమవారం మండల పశు వైద్యాధికారి వీరేశం, వెటర్నరీ అసిస్టెంట్ గట్టయ్యతో కలిసి ఫామ్‌ను సందర్శించారు. అక్కడి పౌల్ట్రీ ఫార్మ్ యజమానితో మాట్లాడారు. కోడిపిల్లలను అందజేసిన కంపెనీ నుంచి నాలుగు రోజుల నుంచి కోళ్లకు సరైన స్థాయిలో దాన సరఫరా కాకపోవడం, అధిక ఉష్ణోగ్రత కారణంగానే కోళ్లు చనిపోయాయని నిర్ధారించారు. చనిపోయిన కోళ్లలో బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సోమవారం ఉదయం మరో 1500 కోళ్లు చనిపోయాయి.

సాంకేతిక విద్య ఉచిత శిక్షణను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి

మనోహరాబాద్(తూప్రాన్): సామాన్య యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ప్రతినిధులు వసంతరాణి, లలిత, వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ భవనంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఎంపీఓ లక్ష్మీనర్సయ్యలతో పాటు పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ అధికారులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువతకు ట్యాలీ, జీఎస్టీ, సైబర్ సెక్యూరిటీ, మొబైల్ ఫోన్ రిపేరింగ్ లాంటి 45 రకాల వాటిలో ఉచితంగా వసతితో పాటు శిక్షణనిస్తామన్నారు. అవసరమైన వారు 99484 66111, 91339 08000 మొబైల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఇంటర్ వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

వెల్దుర్తి(తూప్రాన్): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఈ నెల 5 నుంచి ప్రారంభం కానున్నాయని, అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని శ్రీ రాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అన్నారు. ఆయన మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రాన్ని సీసీ కెమెరాల నిఘాలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులందరూ ఉదయం 8:45 లోపే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. ప్రథమ సంవత్సరంలో 95 మంది ద్వితీయ సంవత్సరంలో 68 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు.

పెద్దశంకరంపేట(మెదక్): ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, డిపార్ట్‌మెంట్ అధికారి శ్యాంరావు తెలిపారు. స్థానిక కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఇందులో ఫస్ట్ ఇయర్‌లో 245, సెకండ్ ఇయర్‌లో 165 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని వారు సూచించారు. పరీక్షా కేంద్రాలకు ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకొని రావొద్దని, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

ఎఫ్ఏ మృతిపై సంతాపం

శివ్వంపేట(నర్సాపూర్): జాతీయ ఉపాధిహామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాములు మృతిపై సిబ్బంది సోమవారం సంతాపం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ రాములు అనారోగ్యంతో ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. దీంతో పరిషత్, ఈజీఎస్ సిబ్బంది ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ అనీల్, ఫీల్డ్ అసిస్టెంట్‌ల సంఘం మండలాధ్యక్షుడు దామోదర్, సంజీవచారి, రాజు, నాగరాజు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

అనారోగ్యంతో మృతి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ రాములు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. సోమవారం ఫీల్డ్ అసిస్టెంట్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని ఆమె ఓదార్చారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికసాయం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నర్సింహారెడ్డి, దామోదర్‌రెడ్డి, చింత స్వామి, సుదర్శన్, వెంకటేష్, తదితరులు ఉన్నారు.



రాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఈజీఎస్ సిబ్బంది

కొబ్బరి మొక్కల పంపిణీ

శివ్వంపేట(నర్సాపూర్): మహిళా సంఘాలు మొక్కల పెంపకం బాధ్యతగా తీసుకోవాలని ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని మహిళా సంఘాల సభ్యులకు నా మొక్క నాబాధ్యతలో భాగంగా 600 కొబ్బరి మొక్కలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణతో పాటు కొబ్బరి మొక్కల ద్వారా అదనపు ఆదాయం పొందేందుకు అవకాశం ఉందని, మరిన్ని పండ్ల మొక్కలను అందిస్తామన్నారు. మండల, గ్రామ సమాఖ్య అధ్యక్షులు ఉన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు

ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించండి

ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): మోడల్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించేలా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శీనివాస్ తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలోని వెంకటాపూర్(ఆర్) గ్రామాన్ని ప్రభుత్వం మోడల్ గ్రామంగా ఎంపిక చేయగా, 47 మంది ఇందిరమ్మ ఇళ్లకు అర్హులుగా గుర్తించామన్నారు. ప్రస్తుతం 19 మందికి మంజూరు వచ్చిందన్నారు. లబ్ధిదారుడి ఇంటి నిర్మాణం ముగ్గువేసి, ఫోన్‌తో జియోట్యాగింగ్ ఫొటోతీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఫొటో తీసిన ప్రదేశంలోనే ఇంటిని నిర్మించాలని చెప్పారు. మంజూరైన వాటికి ప్రభుత్వం బేస్మిట్, రూఫ్‌లేవల్, స్లాబ్‌తో పాటు ఫైనల్ బిల్‌ను విడతల వారీగా చెల్లిస్తుందని చెప్పారు. గ్రామాల్లో మంచి నీరు, ఇతర సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఎంపీఓ కలీముల్ల కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

సంక్షిప్త వార్తలు

◆ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

రేగోడ్(మెదక్): సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని కొండాపూర్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీకాంత్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని లోయపల్లిలో సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను పట్టుకోవాలన్నారు. అదే విధంగా వారిపైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. ధ్వంసం చేసిన విగ్రహాలను ప్రతిష్ఠాపన చేయాలని తెలిపారు.

◆ గ్రామాల్లో పనులు ప్రారంభించండి

మెదక్ కలెక్టరేట్: గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించి ప్రజలకు పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మహిళ కన్వీనర్ నాగమణి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా నూతన కమిటీని ఏర్పాటు చేయగా.. కన్వీనర్‌గా నాగమణి, కో కన్వీనర్‌గా రామవ్వతో పాటు ఇతర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

◆ ఘనంగా బీరప్ప కల్యాణోత్సవం

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామంలో సోమవారం కురుమల ఆరాధ్య దైవమైన బీరప్ప–కామారతిదేవి కల్యాణోత్సవం కురుమ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నర్సాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్, బీజేపీ నాయకుడు మురళీధర్‌యాదవ్, నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి బీరప్ప కల్యాణాన్ని తిలకించి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పరశురాంరెడ్డి, నగేష్‌యాదవ్, ఒగ్గు కళాకారుల బృందం, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ పరామర్శ

నర్సాపూర్: నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నీలంమధు ముదిరాజ్ సోమవారం పరామర్శించారు. మదన్‌రెడ్డికి ఇటీవల గుండె సంబంధమైన సర్జరీ జరిగింది. హైదరాబాద్‌లోని మదన్‌రెడ్డి ఇంటికి నీలంమధు ముదిరాజ్ వెళ్లి ఆయన ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

◆ చెరువును కాపాడాలి

నర్సాపూర్: ప్యారానగర్‌లో డంప్‌యార్డు ఎత్తి వేసి, చెరువును కాపాడాలన్న డిమాండ్‌తో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 14వ రోజుకు చేరాయి. సోమవారం పట్టణానికి చెందిన జేఏసీ నాయకులు రిజ్వాన్, దావూద్, మహ్మద్, అజ్మత్ తదితరులు రిలే దీక్షలో పాల్గొన్నారు. డంప్‌యార్డును ఎత్తి వేయాలని డిమాండు చేశారు. తమ పట్టణాన్ని, చెరువును కాపాడాలని కోరారు.



కౌడిపల్లి ఉన్నత పాఠశాల పీడీ రమేశ్‌కుమార్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

పీడీ రమేశ్‌కుమార్ సేవలు మరువలేనివి

ఎమ్మెల్యే సునీతారెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): ఫిజికల్ డైరెక్టర్(పీడీ) రమేశ్‌కుమార్ సేవలు మరువలేనివని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండల కేంద్రం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో 13 ఏళ్ల విధులు నిర్వర్తించిన పీడీ రమేశ్‌కుమార్ పదవీ విరమణ సన్మానసభ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. క్రీడల్లో విద్యార్థులకు నైపుణ్యాలను వెలికితీసి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనదని తెలిపారు. విధులపై అంకితభావం, క్రమశిక్షణ, మంచితనంతో ఆదర్శంగా నిలిచారన్నారు. అనంతరం రమేశ్‌కుమార్ దంపతులను ఎమ్మెల్యేతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పద్మజ, కౌడిపల్లి, చిలప్‌చెడ్ ఎంఈఓలు బాలరాజు, విఠల్, మండల మాజీ జెడ్పీటీసీ రామాగౌడ్, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నవీన్, ఎస్‌ఎంసీ చైర్మన్ మమత, మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్‌లు జగన్, దుర్గయ్య, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు దిలీప్‌సింగ్‌టాగూర్, సాజిద్‌అలి, స్వరూపరాణి, పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నాయకులు

టేక్మాల్(మెదక్): మండల పరిధిలోని ఎలకుర్తి గ్రామానికి చెందిన ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మహేశ్‌రెడ్డి రాష్ట్ర వైద్యా ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను సోమవారం మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. తనను రాష్ట్ర ఎన్‌ఎస్‌యూఐ కార్యదర్శిగా ఎంపిక చేసినందుకు మంత్రిని సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యదర్శిగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఇందులో విద్యార్థి విభాగం నాయకులు రాజు, అవినాష్‌రెడ్డి ఉన్నారు.



మంత్రిని సన్మానిస్తున్న మహేశ్‌రెడ్డి

పాఠశాల విద్యార్థికి సైకిల్ అందజేత

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని అందుగులపల్లి గ్రామానికి చెందిన వరమ్మ అనే విద్యార్థిని మానెపల్లి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. స్వగ్రామం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మానెపల్లి వరకు సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రతిరోజు కాలినడకన పాఠశాలకు వెళ్తుంది. దీంతో విద్యార్థి ఇబ్బందిని తెలుసుకున్న పాఠశాల గణితం ఉపాధ్యాయుడు అమోస్ సైకిల్ అందించడానికి ముందుకొచ్చాడు. సోమవారం వరమ్మకు పాఠశాల ఆవరణలో ఎంఈఓ యాదగిరి చేతులమీదుగా సైకిల్‌ను అందజేశాడు. అదేవిధంగా ఇటీవల ఎస్జీఎఫ్–2024 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో రెండో స్థానంలో నిలిచిన ఎ. నందినికి సర్టిఫికెట్ అందజేశారు. విద్యార్థిని పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సైకిల్‌ను బహూకరించిన ఉపాధ్యాయుడిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం సీతారాం, హెచ్‌ఎం కౌసల్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి సైకిల్ అందజేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా బాలకిషన్

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి మండల బీజేపీ ఉపాధ్యక్షుడిగా మండలంలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన బాలకిషన్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని ఆ పార్టీ మండలాధ్యక్షుడు దాసు అందజేశారు. మండలంలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత అభివృద్ధి చేయడానికి తనవంతు కృషి చేస్తానని బాలకిషన్ అన్నారు. కార్యక్రమంలో నర్సింలు, శేఖర్‌గౌడ్, వెంకటేశం, శివరాం, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రం అందుకుంటున్న బాలకిషన్

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలి

స్వయంపాలన దినోత్సవం

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరాలని పాఠశాల హెచ్‌ఎం రమేశ్ అన్నారు. మండల కేంద్రం చిలప్‌చెడ ఉన్నత పాఠశాలలో సోమ వారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. ఒక్కరోజు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించిన విద్యార్థులు, తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు.

పాపన్నపేటలో..

పాపన్నపేట(మెదక్): మండలం కేంద్రం పాపన్నపేట, కుర్తివాడ ఉన్నత పాఠశాలల్లో స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు.

కంచన్‌పల్లి ఉన్నత పాఠశాలలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కంచన్‌పల్లి ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు ఒక్కరోజు విధులు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం బుచ్చిరెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు.

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులు స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. బోధనలో ఉత్తమ ప్రతిభ చాటిన వారికి పాఠశాల హెచ్‌ఎం ధర్మపురి బహుమతులు అందజేశారు.



పాపన్నపేట ఉన్నత పాఠశాలలో ఒక్కరోజు ఉపాధ్యాయులుగా విద్యార్థులు



కౌడిపల్లి(నర్సాపూర్): కంచన్‌పల్లి పాఠశాలలో..



చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాలలో..



పాపన్నపేట(మెదక్): కుర్తివాడలో..



వెల్దుర్తి(తూప్రాన్): ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఉపాధిహామీ పనులు ప్రారంభం



పనులు చేస్తున్న కూలీలకు సూచనలు ఇస్తున్న ఏపీఓ రాజ్‌కుమార్

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామీణ ఉపాధిహామీ పనులు మండలంలో సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు మండలంలోని గ్రామాల్లో నిర్వహించిన పనుల్లో 700 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా టీ.మాందాపూర్ గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పనులను ఏపీఓ రాజ్‌కుమార్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో చేసిన పనులు కాకుండా నూతన పనులను మాత్రమే చేయాలని సూచించారు. గ్రామాల్లో అవసరమైన ట్రెంచ్‌లు, పామ్‌పండ్స్ పనులను నిర్వహించడంతో పాటు మొక్కల సంరక్షణ కోసం చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.